www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి!



3

హైదరాబాద్ సంపుటి: 05 సంచిక: 276 గురువారం 05-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు: 07 వెల : 5

యువత లక్ష్య సాధనకు ప్రభుత్వ సహకారం

శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోలీస్ ఉద్యోగాలు సాధించాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క.

భద్రాద్రి న్యూస్ ములుగు

యువత లక్ష్య సాధనకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, పట్టుదలతో చదివి పోలీస్ ఉద్యోగాలు సాధించాలని అభ్యర్థులకు సూచించారు. బుధవారం ములుగు ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను మంత్రి పరిశీలించారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో నేరుగా మాట్లాడి, వారి చదువు, శిక్షణా విధానం, వసతి సౌకర్యాలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల్లో మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అభ్యర్థులు లక్ష్యంపై దృష్టి సారించి, క్రమశిక్షణతో శిక్షణ పొందాలని సూచించారు. ఎక్కువ మంది అభ్యర్థులు ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించి, తదుపరి దశల్లోనూ ప్రతిభ కనబరిచి పోలీస్ ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. అభ్యర్థుల విజయానికి మిగతా 2లో..



ప్రవళిక కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం

- తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు.. రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా
- ఆర్టీసీ నిర్ణయం మేరకు బ్యాంకు ద్వారా మరో కోటి రూపాయల ప్రమాద బీమా
- ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద ప్రవళిక పార్థివదేహానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి నివాళులు

హైదరాబాద్, నవంబర్ 4 (భద్రాద్రిన్యూస్):

ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతి పట్ల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద ప్రవళిక పార్థివదేహానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి నివాళులర్పించారు. అనంతరం ప్రవళిక తల్లిని పరామర్శించి, కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ ఎల్లప్పుడూ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని మంత్రి ప్రకటించారు. ప్రభుత్వం, ఆర్టీసీ తరపున కలిపి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని, ఆర్టీసీ తీసుకున్న నిర్ణయం మేరకు బ్యాంకు ద్వారా మరో కోటి రూపాయల ప్రమాద బీమా పరిహారం కుటుంబానికి అందనుందని వెల్లడించారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ కుటుంబ సభ్యురాలిని కోల్పోవడం మిగతా 3లో..



బోదాపురం వేరుసి దాడులపై బీసీ కమిషన్ విచారణ..

- బుధవారం బాధితుల ఫిర్యాదు
- నివేదిక పంపాల్సిందిగా ములుగు కలెక్టర్ ఎస్పీలకు ఆదేశం
- స్టేషన్ హౌస్ ఆఫీసర్ వద్ద వివరాలు సేకరించిన కమిషన్ అధికారులు



3

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి..

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- బియ్యం కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు
- ప్రతి బియ్యం విక్రయ కేంద్రంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి
- బీపీటీ, కేఎన్ఎం రకాలు కిలో రూ.66, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రూ.74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రూ.79
- నిబంధనలు ఉల్లంఘిస్తే సరుకును స్వాధీనం చేసుకొని వేలం వేస్తాం



3

విద్యార్థుల జీవితాల్లో నిత్య స్ఫూర్తి ప్రేరకులు ఉపాధ్యాయులే

- విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపాలి..
- పోటీ ప్రపంచానికి సిద్ధం చేయాలి.
- చదువుతోపాటు భావవ్యక్తీకరణ నైపుణ్యాలు, కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించాలి.
- మారుమూల విద్యార్థులను అగ్రభాగాన నిలిపిన ఘనత ఉపాధ్యాయులదే.
- విద్యతోపాటు అన్ని రంగాల్లో ములుగును ముందుంచేలా కృషి చేయాలి.
- విద్యా ఫలితాలలో ములుగు జిల్లా మరోసారి ప్రభంజనం సృష్టించాలి .
- అదే స్ఫూర్తితో ఉపాధ్యాయులు పని చేయాలి.
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క.



భద్రాద్రి న్యూస్ ములుగు

విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయులు నిత్య స్ఫూర్తిగా నిలుస్తారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, మిగతా 2లో..

ఉపాధి కల్పన.. జల సంరక్షణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- గ్రామీణ మౌలిక వసతుల నిర్మాణాల పురోగతిని నిరంతరం పరిశీలించాలి
- పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ ఐఏఎస్



2

ఉపాధి కల్పన.. జల సంరక్షణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- **గ్రామీణ మౌలిక వసతుల నిర్మాణాల పురోగతిని నిరంతరం పరిశీలించాలి**
- **పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ ఐఏఎస్**

భద్రాద్రి న్యూస్ ములుగు

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, జల సంరక్షణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ ఐఏఎస్ సూచించారు. గ్రామీణ మౌలిక వసతుల నిర్మాణాల పురోగతి ని నిరంతరం పరిశీలించాలని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ని ర్వహించి ఉపాధి పనులు, కూలీల హాజరు, జాబ్‌కార్డుల జారీ, మేట్ల శిక్షణ, జలసిరి పనులు, గ్రామీణ మౌలిక వసతుల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నవంబర్ 3 నాటి నివేదిక ప్రకారం రాష్ట్రంలోని 12,760 గ్రామ పంచాయతీలకుగాను 12,280 పంచాయతీల్లో ఉపాధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఆ రోజు రాష్ట్రవ్యాప్తంగా 5,02,697 మంది కూలీలు పనులకు హాజరయ్యార ని పేర్కొన్నారు. ఇంకా పనులు ప్రారంభించని పంచాయతీలపై దృష్టి సారించి, ఉపాధి కోరే కూలీలకు పనులు అందుబాటులో ఉంచాలని సూచించారు. జాబ్‌కార్డుల జారీకి సంబంధించిన పెండింగ్ అంశాలను పరిష్కరించాలని, కూలీల హాజరు, పనిదినాల నమోదును పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు.

జలసిరి కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 55,133 పనులు ప్రారంభిం చి, 14,121 పనులు పూర్తి చేసినట్లు కమిషనర్ తెలిపారు. వ్యవసాయ కుంటలు, ఊటకుంటలు, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మా ణాల పూర్తిపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. పశుగ్రాస సాగు, పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణానికి ప్రాధాన్యమివ్వాలని పే ర్కొన్నారు. గ్రామీణ మౌలిక వసతుల నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా సిద్ధం చేసేలా పురోగతిని పర్యవేక్షించాలని తెలిపారు.

ములుగు జిల్లాలో 171 గ్రామ పంచాయతీలకుగాను 162 పంచాయ తీల్లో ఉపాధి పనులు ప్రారంభించామని, నవంబర్ 3న 7,465 మంది కూలీలు పనులకు హాజరయ్యారని జిల్లా అదనపు కలెక్టర్ ఎం. సంపత్ రావు కమిషనర్‌కు వివరించారు. పనులు ప్రారంభమైన పంచాయతీల్లో కూలీల సగటు హాజరు 46గా నమోదై, రాష్ట్ర సగటు 41 కంటే మెరుగ్గా ఉండటంపై కమిషనర్ జిల్లా అధికారులను అభినందించారు. జిల్లాలో ప్రారంభించిన వ్యవసాయ కుంటల పనులతోపాటు నవంబర్ 19 నాటికి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాల్సిన 254 నిర్మాణాల పురోగతి ని నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ రవీందర్, సంబంధిత అధికారులు తదిత రులు పాల్గొన్నారు.





విద్యార్థుల జీవితాల్లో నిత్య స్ఫూర్తి ప్రదాతలు ఉపాధ్యాయులే.







మొదటిపేజీ తరువాయి

పోటీ ప్రపంచంలో రాణించేలా సిద్ధం చేయాలని కోరారు.

బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పదో తరగతి వార్షిక పరీక్ష లు-2027 విద్యార్థుల సంసిద్ధతపై ప్రధానోపాధ్యా యులు,

మండల విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, విద్యా శాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యుల సమష్టి కృషితో పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ములుగు జిల్లా ఉత్తమ స్థానాలు సాధించిం దని తెలిపారు. గిరిజన ప్రాంతం విద్యలో వెనుకబడి ఉంటుందనే భావనను మార్చి, జిల్లా విద్యార్థుల ప్ర తిభను రాష్ట్రానికి చాటిచెప్పారని ప్రశంసించారు. కలెక్టర్, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తీసుకున్న ప్రత్యేక చర్యలు మెరుగైన ఫలితాలకు దోహదపడ్డాయని అన్నారు. ఉపాధ్యాయుల కృషిని ఎప్పటికీ మర్చిపోమని, వారి కష్టసుఖాల్లో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఒక ఉపాధ్యాయుడి జీవితంలో వేలాది మంది విద్యా ర్థులు ఉంటారని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల ప్రభావం ఎంతో ఉంటుందని పేర్కొ న్నారు. విద్యార్థులకు జ్ఞానాన్ని అందించేందుకు, వారిని ప్రోత్సహించేందుకు వెచ్చించే సమయం, శ్రమ వారి విజయాల్లో ప్రతిబింబిస్తాయని అన్నారు. విద్యార్థులకు ఇష్టమైన ఉపాధ్యాయులుగా మెలుగుతూ, ఆయా సబ్జెక్టులపై ఆసక్తిని పెంచాలని సూచించారు. మారుమూల ప్రాంతాల నుంచి ఎది గినవారు తమలాంటి మరెన్నో తరాలు ముందుకు వచ్చేలా కృషి చేయాలని, సొంత ప్రాంతానికి సేవ చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోటీ రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వి ద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు తగిన ప్రేరణ అందించాలని సూచించారు. సిలబస్‌ను పూర్తి చేసి, పునశ్చరణ, సాధన పరీక్షల ద్వారా విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించాలని తెలిపారు. ఏయే అంశాల్లో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రో గుర్తించి, ప్రత్యేక సమయం కేటాయించి బోధిం చాలని సూచించారు. వసతిగృహాల్లోని విద్యార్థుల పైనా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. కృత్రిమ మేధ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న తరుణంలో చదువుతోపాటు భావవ్యక్తీకరణ నైపు ణ్యాలు, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించాల ని కోరారు. ముఖ్యంగా గిరిజన గ్రామాల విద్యార్థుల్లో బిడియాన్ని తొలగించి, ఆత్మవిశ్వాసాన్ని నింపాలని సూచించారు.

ములుగు జిల్లా విద్యుతోపాటు రహదారులు, పర్యా టకం, మౌలిక వసతులు తదితర అన్ని రంగాల్లో ముందుండేలా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. జిల్లాలో సమృద్ధిగా ఉన్న అటవీ సంపద, సహజ వనరులు, సాంస్కృతిక వైభవాన్ని అభివృద్ధికి విని యోగించుకోవాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు తమ పరిజ్ఞానం, అనుభవం, పరిశీలనల ఆధారంగా విద్యాభివృద్ధితోపాటు జిల్లా అభివృద్ధికి ఉపయోగపడే ఆలోచనలు, సూచనలు అందించాలని కోరారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహ దేవరావు మాట్లాడుతూ, ములుగు జిల్లా విద్యా ఫలితా ల్లో వరుస విజయాలు సాధించడం ఉపాధ్యాయుల అంకితభావం, కృషికి నిదర్శనమని అభినందించా రు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఒకే మార్గదర్శకాలు అందినా, వాటిని సమర్థంగా అమలు చేసి జిల్లాను అగ్రస్థానంలో నిలిపిన ఘనత ఉపాధ్యాయులదేనని అన్నారు. వరుస విజయాలు కష్టానికి ప్రతిఫలమేన ని పేర్కొన్నారు. ఇదే ఉత్సాహం, ఆత్మవిశ్వాసంతో పనిచేసి మరోసారి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులను కోరారు.

ఉపాధ్యాయులు అందించే చిన్న ప్రోత్సాహం కూడా విద్యార్థి జీవితంలో గొప్ప మార్పుకు దారితీస్తుందని కలెక్టర్ అన్నారు. ప్రస్తుతం చదువులో వెనుకబడిన విద్యార్థులు భవిష్యత్తులో విశేషంగా రాణించవచ్చు ని, వారిలో నమ్మకాన్ని పెంచి ముందుకు నడిపిం చాలని సూచించారు. విధి నిర్వహణలో భాగంగా ఉపాధ్యాయులు అందించే సహాయాన్ని విద్యార్థు లు జీవితాంతం గుర్తుంచుకుంటారని, తాను ఈ స్థాయికి చేరుకోవడంలోనూ తన ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఉందని గుర్తుచేశారు. ప్రతి విద్యా ర్థిని ఆదరణతో ప్రోత్సహిస్తూ, ముఖ్యంగా చదువులో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి మరింత అండగా నిలవాలని కోరారు.

అంతకుముందు జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ, డిసెంబర్ నాటికి సిలబస్‌ను పూర్తి చేసి, విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహి స్తామని మంత్రికి వివరించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని బట్టి ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి, వారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక బోధన అంది స్తామని తెలిపారు. కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి విద్యార్థులకు అందిస్తామని పేర్కొన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధిం చడంతోపాటు, జిల్లాను మరోసారి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపి రికార్డు సృష్టించేలా కృషి చేస్తున్నా మని వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనార్ధన్, జీసీడీఓ, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

యువత లక్ష్య సాధనకు ప్రభుత్వ సహకారం

మొదటిపేజీ తరువాయి

అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రి శిక్షణా ర్థులతో కలిసి భోజనం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, డీఎస్పీ రవీందర్, ఆర్ఐ, సీఐ, ఎస్సైలు తదితరులు పాల్గొ న్నారు.







ఆర్టీసీ మహిళా కండక్టర్ ప్రవళిక మృతి పట్ల పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు తీవ్ర సంతాపం

భద్రాద్రి న్యూస్ మణుగూరు



మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక మృతి పట్ల పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ శ్రీ పాయం వెంకటేశ్వర్లు తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు.

ప్రవళిక మృతి తనను ఎంతగానో కలచివేసిందని పేర్కొంటూ, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ విషాద సమయంలో ప్రవళిక కుటుంబానికి అండగా ఉంటామని, అన్ని విధాలుగా ఆదుకుంటామ ని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆమె కుటుంబానికి మనోధైర్యం కల్పిస్తూ, మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి..

- **జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**
- **బియ్యం కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు**
- **ప్రతి బియ్యం విక్రయ కేంద్రంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి**
- **బీపీటీ, కేఎన్ఎం రకాలు కిలో రూ.66, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రూ.74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రూ.79**
- **నిబంధనలు ఉల్లంఘిస్తే సరుకును స్వాధీనం చేసుకొని వేలం వేస్తాం**
- **బియ్యం ధరల నియంత్రణపై సంబంధిత అధికారులు, లీగల్ మెట్రోలజి, మిల్లర్లు, హోల్ సేల్, రిటైల్ విక్రయదారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**

ఖమ్మం ప్రతినిధి , నవంబర్- 04 (భద్రాద్రిన్యూస్):-

జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలని, బియ్యం కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాస రెడ్డితో కలిసి జిల్లాలో బియ్యం ధరల నియంత్రణ, సరఫరా వ్యవస్థ నిర్వహణ పై సంబంధిత శాఖల అధికారులు, లీగల్ మెట్రోలజి, మిల్లర్లు, హోల్ సేల్, రిటైల్ విక్రయదారులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ బియ్యం నిత్యావసర వస్తువని, ప్రజలకు నిర్ణీత ధరలకు బియ్యం అందుబాటులో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. జిల్లాలో బియ్యం విక్రయించే ప్రతి దుకాణంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలను స్పష్టంగా తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి ఏ పరిస్థితుల్లోనూ బియ్యం విక్రయించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యం కిలో రూ. 66, ఆర్ఎన్ఆర్., తెలంగాణ సోనా రకం బియ్యం కిలో రూ.74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకం బియ్యం కిలో రూ. 79గా రిటైల్ విక్రయ ధరలను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ధరలను ప్రతి రిటైల్ వ్యాపారి తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

బియ్యం మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు, రిటైల్ వ్యాపారులందరికీ ప్రభుత్వం నిర్ణయించిన ధరలపై స్పష్టమైన సమాచారం అందించాలని, సరఫరా వ్యవస్థలో ఎలాంటి అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

జిల్లాలో బియ్యం నిల్వలు, సరఫరా, విక్రయాలపై అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. బియ్యం కృత్రిమ కొరత సృష్టించడం, నిల్వలను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిత్యావసర వస్తువుల చట్టం (Essential Commodities Act) ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి తెచ్చుకోవద్దని వ్యాపారులకు సూచించారు. వ్యాపారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు.



ప్రభుత్వం నిర్ణయించిన ధరలను ఉల్లంఘించి బియ్యం విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా, అక్రమంగా నిల్వలు దాచిపెట్టినా వెంటనే సరుకును స్వాధీనం చేసుకొని వేలం వేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో బియ్యం ధరల నియంత్రణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, మిల్లర్ల నుంచి రిటైల్ వ్యాపారుల వరకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలు అమలయ్యేలా క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, డి ఎం సివిల్ సప్లయ్ మల్లికార్జున బాబు, లీగల్ మెట్రోలాజి అధికారి, సంబంధిత శాఖల అధికారులు, మిల్లర్లు, హోల్ సేల్, రిటైల్ విక్రయదారులు, శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రవళిక కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం

మొదటిపేజీ తరువాయి

అత్యంత బాధాకరమని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆర్టీసీ యాజమాన్యం తరఫున ఆసుపత్రికి వెళ్లి మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని ప్రయత్నాలు చేశామని, అయినప్పటికీ దురదృష్టవశాత్తూ ప్రవళిక ప్రాణాలు కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, నిందితుడిపై హత్యాయత్నం కేసు స్థానంలో హత్య కేసు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని, ఆర్టీసీ సిబ్బంది ఎవరైనా ప్రయాణికుల పట్ల తప్పుగా ప్రవర్తిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదులపై తగిన విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అయితే ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని సిబ్బందిపై దాడులకు పాల్పడకూడదని విజ్ఞప్తి చేశారు.

ప్రవళిక కుటుంబానికి ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం, ఆర్టీసీ అన్ని విధాలుగా అండగా ఉంటాయని హామీ ఇచ్చారు. ఆర్థిక సహాయం అందించినప్పటికీ కుటుంబ సభ్యురాలిని కోల్పోయిన బాధను ఎవరూ తీర్చలేరని భావోద్వేగానికి గురయ్యారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి అనేక నిర్ణయాలు తీసుకున్నామని, పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. కార్మికుల భద్రతతో పాటు ప్రయాణికుల సౌకర్యం కూడా సమాన ప్రాధాన్యత కలిగిన అంశాలని పేర్కొన్నారు.





ఆర్టీసీ క్రమశిక్షణ కలిగిన సంస్థగా ముందుకు సాగుతుందని, సిబ్బంది కూడా ప్రయాణికులను దేవుళ్లుగా భావించి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కోరారు. ప్రయాణికులు, సిబ్బంది మధ్య ఏవైనా సమస్యలు తలెత్తితే చట్టపరంగా ఫిర్యాదు చేసుకోవాలని, దాడులకు పాల్పడటం సరైన పద్ధతి కాదని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

ప్రమాదంలో కాలుకు గాయమైన ములుగు జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు లక్ష్మణ్ బాబు పరామర్శించిన గొడవర్తి

భద్రాద్రి న్యూస్ వెంకటాపురం

ప్రమాదంలో కాలుకు గాయమై విశ్రాంతి తీసుకుంటున్న ములుగు జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్ బాబు ని బుధవారం వెంకటాపురం నాయకులు కలిసి పరామర్శించారు.

ఆయన నివాసానికి వెళ్లి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్న ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా వెంకటాపురం (నూగురు)మండల పార్టీ అధ్యక్షులు గంప రాంబాబు మాట్లాడుతూ "లక్ష్మణ్ బాబు జిల్లాలో పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు. కాలుకు గాయమైనా పార్టీ కార్యక్రమాలపై పూర్తి దృష్టి పెట్టడం అభినందనీయం. ఆయన త్వరగా కోలుకుని తిరిగి ప్రజల్లోకి రావాలని కోరుకుంటున్నాం" అని తెలిపారు.

పరామర్శించిన వారిలో వెంకటాపురం నాయకులు ముడుంబా శ్రీనివాస్. మంచర్ల నాగేశ్వరరావు.బట్ట నాగేందర్. కుషం దుర్గా ప్రసాద్.గారు, తదితరులు పాల్గొన్నారు.



బోదాపురం వరుస దాడులపై బీసీ కమిషన్ విచారణ

- **బుధవారం బాధితుల ఫిర్యాదు**
- **నివేదిక పంపాల్సిందిగా ములుగు కలెక్టర్ ఎస్పీలకు ఆదేశం**
- **స్టేషన్ హౌస్ ఆఫీసర్ వద్ద వివరాలు సేకరించిన కమిషన్ అధికారులు**

ములుగు జిల్లా వెంకటాపురం మండలం బోదాపురం గ్రామంలో కుమ్మరి వారిపై ఇటీవల జరిగిన వరుస దాడులపై రాష్ట్ర బీసీ కమిషన్ విచారణ చేపట్టింది. మూడు తరాలుగా తమ ఆధీనంలో ఉన్న భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నించడమే కాక తమపై అగ్రకులస్థులు వరుస దాడులకు పాల్పడుతున్నారని బాధితులు బుధవారం బీసీ కమిషన్ కు ఫిర్యాదు చేశారు. మూడు తరాలుగా తాము నివసిస్తున్న ఇండ్లకు ముళ్ళ కంచెలు వేసి మూడు రోజుల పాటు నిర్బంధించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయినప్పటికీ పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. మొదటి సారి దాడి చేసినప్పుడు, ముళ్ళ కంచెలు వేసినప్పుడు పోలీసులు కేసులు పెట్టి ఉంటే వరుస దాడులు జరిగేవి కాదని వారు తెలిపారు. స్థల వివాదంలో పోలీసులు తలదూర్చడమే కాక అగ్రకులస్థులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని కమిషన్ దృష్టికి తెచ్చారు. 60 సంవత్సరాల క్రితమే తమ పూర్వీకులు కొనుగోలు చేసిన భూమి తమ ఆధీనంలో ఉన్నదని, గతంలో అక్కడ కుండలు చేసుకుని జీవించేవారమని తెలిపారు. ఇటీవల బరెలను కట్టివేసి పాలు అమ్ముకుని జీవిస్తున్నామని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల అగ్రకులస్థులు చేసిన దాడిలో తీవ్రంగా గాయపడ్డామని వివరించారు. దాడిలో తమకు తగిలిన గాయాలతో పాటూ గతంలో తమ గుమ్మాలకు కంచెలు వేసిన ఫోటోలను కూడా ఫిర్యాదుతో జత పరిచారు. అగ్ర కులస్తులతో కుమ్ముక్కైన అధికారులు తమ ఆధీనంలో ఉన్న భూమికి పొసెషన్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని తెలిపారు. బాధితులు వాంగ్మూలాన్ని కమిషన్ అధికారులు నమోదు చేశారు. వారికి తగిలిన దెబ్బలను, ఫొటోలను చూసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్, సభ్యుడు తిరుమలగిరి సురేందర్ చలించిపోయారు. జరిగిన సంఘటనపై విచారం వ్యక్తం చేశారు. కమిషన్ అధికారి వెంకటాపురం పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కు ఫోన్ చేసి వివరాలను సేకరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదును ఫొటోలతో సహా జిల్లా కలెక్టర్, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కు పంపించారు. ఫిర్యాదుపై వారం రోజుల్లో నివేదికలు పంపాలని వారిని ఆదేశించారు. కలెక్టర్, ఎస్పీ నుంచి నివేదికలు అందిన తర్వాత పూర్తి స్థాయి విచారణ ప్రారంభిస్తామని, అవసరమైతే సంఘటనా స్థలాన్ని సందర్శిస్తామని కమిషన్ సభ్యుడు తిరుమలగిరి సురేందర్ తెలిపారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి!

- **నకిలీ వినియోగదారుల సేవా కేంద్రాలు, పెట్టుబడి మోసాలు, తెరను పంచుకునే యాప్‌లతో జాగ్రత్త**
- **"మీ డబ్బు – మీ క్లిక్ – మీ ఎంపిక" నినాదంతో నవంబర్ నెలంతా జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు**

కొత్తగూడెం, నవంబర్ 4 (భద్రాద్రిన్యూస్):

సైబర్ ఆర్థిక నేరాలను అరికట్టడంతో పాటు ప్రజల్లో సురక్షితమైన అంతర్జాల లావాదేవీలపై అవగాహన పెంపొందించేందుకు నవంబర్ నెల మొత్తం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ తెలిపారు. "మీ డబ్బు - మీ క్లిక్ - మీ ఎంపిక" అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ నేరాల నివారణకు సంబంధించిన అవగాహన పోస్టర్లను ఎస్పీ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త పద్ధతులను అనుసరిస్తూ ప్రజలను ఆర్థిక మోసాలకు గురిచేస్తున్నారని, ప్రతి ఒక్కరూ అంతర్జాల లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ముఖ్యంగా నకిలీ వినియోగదారుల సేవా కేంద్రాల ఫోన్ నంబర్లు, అధిక లాభాలు వస్తాయంటూ ఆకర్షించే పెట్టుబడి పథకాలు, ఇతరుల ఫోన్ తెరను వీక్షించేందుకు లేదా పంచుకునేందుకు ఉపయోగించే యాప్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ, యూపీఐ రహస్య సంఖ్య, బ్యాంకు ఖాతా వివరాలను అపరిచితులకు వెల్లడించకూడదని, గుర్తుతెలియని వ్యక్తులు పంపించే అనుమానాస్పద లింకులను తెరవకూడదని సూచించారు. ఆన్‌లైన్‌లో వచ్చే ఆకర్షణీయమైన పెట్టుబడి ఆఫర్లను నమ్మి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా సైబర్ ఆర్థిక మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే జాతీయ సైబర్ నేరాల సహాయ నంబర్ 1930కు ఫోన్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. సత్వరమే ఫిర్యాదు చేయడం ద్వారా నష్టాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబర్ విభాగం సీఐ నరేష్, టేకులపల్లి సీఐ సత్యనారాయణ, ఎస్సై జుబేదా బేగం, సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.





శివాలయం చైర్మన్ కూచిపూడి బాబును పరామర్శించిన ఎమ్మెల్యే

భద్రాద్రి న్యూస్ మణుగూరు

మణుగూరు మండలం శివలింగాపురం గ్రామానికి చెందిన శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు మోకాలి చికిత్స అనంతరం కోలుకుంటున్న విషయం తెలుసుకున్న పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు బుధవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.

కూచిపూడి బాబు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనకు ధైర్యం చెబుతూ, ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, మైనారిటీ అధ్యక్షులు రహీం పాషా, సీనియర్ నాయకులు జీవి, ఎస్సీ సెల్ టౌన్ అధ్యక్షులు పొడుతూరి రవి, ముఖ్య నాయకులు మధు, మహిళా నాయకులు కుంచపు పద్మ, యువజన నాయకులు పొడుతూరి నానాజీ, లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

భద్రాద్రి న్యూస్ ములుగు

జన విజ్ఞాన వేదిక తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'చెకుముకి సైన్స్ సంబురాలు-2026' పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆవిష్కరించారు. నవంబర్ 12న పాఠశాల స్థాయి, నవంబర్ 21న మండల స్థాయి, నవంబర్ 29న జిల్లా స్థాయి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. డిసెంబర్ 12, 13 తేదీల్లో మేడ్చల్‌లోని సీఎంఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో రాష్ట్ర స్థాయి సైన్స్ సంబురాలు జరగనున్నాయి. వీటిలో భాగంగా సైన్స్ ప్రదర్శనలు, సైన్స్ మ్యాజిక్ షో, శాస్త్రవేత్తలతో ముఖాముఖి, సైన్స్ కార్నివాల్ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



భారీ వర్షా ల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- **మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు**

భద్రాద్రి న్యూస్ అశ్వరావుపేట



అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు పాటించాలని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బి ఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు సూచించారు.

భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు, చెరువులు పొంగి ప్రవహించే ప్రమాదం ఉన్నందున ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు. అత్యవసర పరిస్థితులు మినహా అనవసరంగా ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. ముఖ్యంగా వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో వాటిని దాటే ప్రయత్నం చేయడం, ఫోటోలు లేదా వీడియోలు తీసేందుకు ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లడం వంటివి చేయవద్దని హెచ్చరించారు.

ప్రజల ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను పర్యవేక్షించాలని మెచ్చా సూచించారు.అలాగే నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు కూడా అప్రమత్తంగా ఉంటూ వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు.

పారదర్శకంగా అంగన్‌వాడీ పోస్టుల భర్తీ

- **దళారుల మాటలు నమ్మొద్దు.**
- **నాలుగు రోజులపాటు జరగనున్న ఇంటర్వ్యూలు.**
- **ఇంటర్వ్యూలను నిర్వహించిన కమిటీ చైర్మన్ మరియు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**

భద్రాద్రి న్యూస్ ములుగు





అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ పోస్టుల భర్తీ ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే దళారుల మాటలు నమ్మి అభ్యర్థులు మోసపోవద్దని స్పష్టం చేశారు.బుధవారం ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆర్ డి ఓ కృష్ణవేణి, ఎస్ డి సి ప్రతాప్, డి ఎం హెచ్ ఓ గోపాలరావు, డి డబ్ల్యూ ఓ ప్రేమలత ఫైవ్ మెన్ కమిటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలను నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అభ్యర్థుల అర్హతలను పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ఎంపిక చేస్తున్నామని తెలిపారు. ఎంపిక ప్రక్రియలో దళారుల ప్రమేయానికి తావులేదని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని సూచించారు. జిల్లాలోని తాడ్వాయి, వెంకటాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న 31 అంగన్‌వాడీ టీచర్, 104 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి నవంబర్ 4 నుంచి 7వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తొలిరోజు తాడ్వాయి ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్ పోస్టుల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

నవంబర్ 5న వెంకటాపురం ప్రాజెక్టు అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు, 6న తాడ్వాయి ప్రాజెక్టు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు, 7న వెంకటాపురం ప్రాజెక్టు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు.

నూతన హెచ్ ఆర్ ఎం ఎస్ విధానం పై శిక్షణ

భద్రాద్రి న్యూస్ ములుగు





ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు రికార్డులు, వ్యక్తిగత వివరాలు, సేవా సంబంధిత కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన ఈహెచ్ఆర్ఎంఎస్ (eHRMS) విధానంపై బుధవారం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ సంచాలకులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం కొనసాగింది.

ప్రస్తుతం అమలులో ఉన్న హెచ్ఆర్ఎంఎస్ (HRMS) విధానం స్థానంలో ప్రవేశపెడుతున్న నూతన ఈహెచ్ఆర్ఎంఎస్ విధానానికి మార్పు, సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగుల వ్యక్తిగత, సర్వీసు వివరాల నమోదు, వివిధ పరిపాలనా ప్రక్రియలు, సాఫ్ట్‌వేర్ వినియోగ విధానం, అందుబాటులో ఉండే సదుపాయాలపై అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

ఈ కార్యక్రమానికి డి టి ఓ సయ్యద్ ఖాలీద్ హుస్సేన్, పి ఏ ఓ తులసి దాస్, ఉప కోశాధికారి ప్రకాశ్ రెడ్డి నాయకత్వం వహించి, నూతన విధానం అమలుకు సంబంధించిన అంశాలను వివరించారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (డీడీఓలు), వారి కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఈహెచ్ఆర్ఎంఎస్ విధానాన్ని అన్ని శాఖల్లో సమర్థవంతంగా అమలు చేసేందుకు అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. నూతన విధానం ద్వారా ఉద్యోగుల సర్వీసు సంబంధిత కార్యకలాపాలను వేగవంతంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలవుతుందని అధికారులు పేర్కొన్నారు.

సారపాకలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ: సర్పంచ్ గూగులోత్ కిషోర్ శివరాం నాయక్ భద్రాద్రి న్యూస్ బూర్గంపాడు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపాడు మండలం పరిధిలోని సారపాక గ్రామంలో గ్రామ రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో 'స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ' కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.

ఈ కార్యక్రమానికి సారపాక మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్రీ గూగులోత్ కిషోర్ శివరాం నాయక్ ముఖ్య అతిథిగా హాజరై, అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను స్వయంగా అందజేశారు.

ప్రజలందరికీ ఫలాలు అందడమే ప్రభుత్వ లక్ష్యం:

ఈ సందర్భంగా సర్పంచ్ గూగులోత్ కిషోర్ శివరాం నాయక్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి తెల్ల రేషన్ కార్డు అందించాలనే స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ పంపిణీ వ్యవస్థ మరింత పారదర్శకంగా మారుతుందని, లబ్ధిదారులకు సేవలు మరింత సులభతరం అవుతాయని ఆయన తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు వెంకన్న, ప్రసాద్ (VROలు/రివిన్యూ సిబ్బంది), పంచాయతీ కార్యదర్శి జి రవికుమార్,ప్రతినిధులు, వార్డు సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.





విధి నిర్వహణలో మహిళా ఆర్టీసీ కండక్టర్ మృతి

- **విధి నిర్వహణలో మహిళా ఆర్టీసీ కండక్టర్ మృతి**
- **-అత్యంత బాధాకరం – ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం**
- **-ప్రవళిక కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి – కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించాలి.**

మణుగూరుకు చెందిన ఆర్టీసీ డిపో మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక విధి నిర్వహణలో ఉండగా జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని కరకగూడెం బిజెపి మండల పార్టీ అధ్యక్షులు జుజ్జురి నరేష్ ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలకు సేవలందించే బాధ్యతలో ఉన్న మహిళా ఉద్యోగికి తగిన భద్రత లేకపోవడం, గాయపడిన అనంతరం మెరుగైన వైద్యం అందించి ఆమె ప్రాణాలను కాపాడ లేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతోందని విమర్శించారు

ఈ ఘటనపై ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, ప్రవళిక మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆమె కుటుంబ సభ్యులకు తన హృదయపూర్వక సానుభూతిని ప్రకటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడులు జరగడం ఆందోళనకరమని, ముఖ్యంగా మహిళా ఉద్యోగుల భద్రత విషయంలో ప్రభుత్వం మరింత బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. ప్రవళిక కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి అందించాలని, ఆమె కుటుంబంలో అర్హులైన ఒకరికి ఆర్టీసీలో శాశ్వత ఉద్యోగం కల్పించి ఆ కుటుంబానికి అండగా నిలవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రవళిక మృతికి కారణమైన ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్టీసీ బస్సుల్లో విధులు నిర్వహించే కండక్టర్లు, డ్రైవర్లు, ముఖ్యంగా మహిళా ఉద్యోగులకు ప్రత్యేక భద్రతా చర్యలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం ఉద్యోగుల ప్రాణాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యతను విస్మరించకూడదని, ఒక ఉద్యోగి విధి



నిర్వహణలో ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం రోడ్డున పడకుండా ఆదుకోవడం ప్రభుత్వ కనీస బాధ్యత అని పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ప్రవళిక కుటుంబానికి న్యాయం చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

రైతు మహాసభలను జయప్రదం చేయండి..

- **నల్లగొండలో జరిగే బహిరంగ సభకు ఇంటికోమనిషి కదలిరండి...**
- **సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజీ రమేష్ పిలుపు.**

భద్రాద్రి న్యూస్ భద్రాచలం

అఖిలభారత రైతు సంఘం ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని, నవంబర్15న నల్లగొండలో జరిగే బహిరంగ సభకు ఇంటికోమనిషి తరలి రావాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ పిలుపునిచ్చారు. సిపిఎం భద్రాచలం పట్టణ కమిటీ సమావేశం ఎంబీ నర్సారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..

నరేంద్ర మోడీ తీసుకు వచ్చిన నల్ల చట్టాలను నిరసిస్తూ దేశ రాజధాని ఢిల్లీలో రైతులు చేసిన పోరాటం దేశానికే స్ఫూర్తిగా నిలిచిందని ఏ జే రమేష్ గుర్తు చేశారు. నాటి పోరాటంలో అఖిల భారత రైతు సంఘం కీలక భూమిక పోషించిందని అన్నారు. ఓవైపు ఎల్ ఈ నో మరోవైపు మోడీ రైతు వ్యతిరేక విధానాలతో అన్నదాతలకు అనేక రూపాలలో కష్టాలు వచ్చి పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని అటువంటి అన్నదాతకు ఈరోజు వస్తున్న సమస్యల పరిష్కారం కోసం రైతు మహాసభలలో విస్తృత చర్చలు జరగనున్నాయని అన్నారు. అఖిల భారత రైతు సంఘం మహాసభల విజయవంతం కోసం దాదాపు 6 నెలల ముందు నుండే దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. రైతు మహాసభల సందర్భంగా ఈ నెల 15న నల్లగొండ పట్టణంలో భారీ రెడ్ షర్టు వాలంటరీ కవాతు నిర్వహించబోతున్నామని ఆ కవాతులో యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నదాతలకు మద్దతుగా నిలవాలని ఏజే రమేష్ పిలుపునిచ్చారు. అనంతరం నల్లగొండ పట్టణంలో భారీ రైతు



బహిరంగ సభ జరుగుతుందని లక్షలాదిమంది చిన్న సన్నకారు రైతులు ఈ బహిరంగ సభలో పాల్గొన్నారని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు డి సీతాలక్ష్మి పట్టణ కమిటీ సభ్యులు ఎన్ నాగరాజు జీవనజ్యోతి కుంజా శ్రీనివాస్ ధనకొండ రాఘవయ్య అజయ్ కుమార్ సంద్ర భూపేంద్ర కోరాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసినఎమ్మెల్యే,
ప్రవళిక భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించిన పాయం

- **కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా.. రూ.కోటి ప్రమాద బీమా**

భద్రాద్రి న్యూస్ మణుగూరు





మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక మృతి పట్ల పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రవళిక భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉన్న మహిళా కండక్టర్ ప్రవళిక మృతి అత్యంత బాధాకరమని, ఒక కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న మహిళను కోల్పోవడం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటనపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించి, ప్రవళిక కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలవాలని ఆదేశించడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవళిక కుటుంబాన్ని పరామర్శించి, ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇవ్వడం హర్షణీయమన్నారు.

ప్రవళిక కుటుంబానికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నట్లు, ప్రభుత్వం మరియు ఆర్టీసీ తరఫున కలిపి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు వెల్లడించారని పేర్కొన్నారు. అదే విధంగా ఆర్టీసీ తీసుకున్న నిర్ణయం మేరకు బ్యాంకు ద్వారా రూ.కోటి ప్రమాద బీమా పరిహారం కూడా కుటుంబానికి అందనుందని తెలిపారు.

కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయ సహకారాలు వారి భవిష్యత్తుకు కొంత భరోసా కల్పిస్తాయని, ఆపద సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యతకు నిదర్శనమని అన్నారు. అయితే కుటుంబ సభ్యురాలిని కోల్పోయిన బాధను ఎన్ని ఆర్థిక సహాయాలు అందించినా తీర్చలేమని విచారం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ కార్మికుల భద్రత, సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది మధ్య ఏవైనా సమస్యలు తలెత్తితే చట్టపరమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని, ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని అన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రవళిక కుటుంబానికి అండగా నిలుస్తామని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భరోసా ఇచ్చారు.

ఈ విషాద సమయంలో ప్రవళిక కుటుంబానికి అండగా నిలిచి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, ఎక్స్‌గ్రేషియా, ప్రమాద బీమా వంటి సహాయాలను ప్రకటించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పినపాక నియోజకవర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, మహిళా అధ్యక్షురాలు, మహిళా నాయకులు, యూత్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

మహిళా కండక్టర్ ప్రవళిక మృతి పట్ల
తుళ్లూరి బ్రహ్మన్న తీవ్ర దిగ్భ్రాంతి

అశ్వాపురం నవంబర్ 4:(భద్రాద్రి న్యూస్)



టీజీఎస్ ఆర్టీసీ మణుగూరు డిపో మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక మృతి పట్ల రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు తుళ్లూరి బ్రహ్మన్న తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. ప్రవళిక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని, హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేశారు. ఈ విషాద సమయంలో ప్రవళిక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ప్రకటించడం అభినందనీయమని పేర్కొన్నారు.

"గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ"ఓటరు నమోదు ప్రక్రియ

- **అర్హులైన విద్యార్థులను, ఉద్యోగులను కలిసి విజ్ఞప్తి**
- **నవంబర్_6 లోపు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలి అంటూ సూచనలు**

భద్రాద్రి న్యూస్ బూర్గంపహాడ్:

నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలోనే జరగనున్న నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటరు జాబితాల " ఫామ్ 18 ద్వారా" తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు విజ్ఞప్తి చేశాయి.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని,మన ఓటుహక్కును'మనం వినియోగించుకోవాలంటే ముందుగా ఓటరు జాబితాలో మన పేరు నమోదై ఉండేలా చూసుకోవాలని సూచించారు.పట్టభద్రులు ప్రతిఒక్కరూ'ప్రజాస్వామ్యంలోతమవంతు బాధ్యతగా ఓటరు నమోదులో పాల్గొని, ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావాలని పిలుపునిస్తూ..... మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ పూలపెల్లి సుధాకర్ రెడ్డి గారి నేతృత్వంలో..... పార్టీ సీనియర్ నాయకులు, పలువురు ప్రజాప్రతినిధుల సమన్వయంతో బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని పట్టభద్రులైన పలువురు విద్యార్థులను, ఉద్యోగస్థులను అర్హులైన పట్టభద్రుల ఓటర్లను కలుస్తూ ఓటు నమోదుప్రక్రియలో భాగస్వామ్యం చేసేలా కార్యచరణ చేపట్టారు



ఉమ్మడి ఖమ్మం – నల్గొండ వరంగల్ జిల్లాల గ్రాడ్యుయేట్
ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమం

గురువారం ఉదయం 11 గంటల నుంచి *భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు *డాక్టర్ తెల్లం వెంకట్రావు సమక్షంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించబడుతుందని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి

అక్టోబర్ 2023 సంవత్సరానికి డిగ్రీ పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవడానికి ఇంకా రెండు రోజుల సమయం మాత్రమే ఉన్నందున, ఇప్పటివరకు ఓటు నమోదు చేసుకోని అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోరుతుంది

అర్హులైన పట్టభద్రులు భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద చేపట్టిన కార్యక్రమంలో ఓటును నమోదు చేసుకోవాల్సిందిగా కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి చేస్తుంది



"చెకుముకి సైన్స్ సంబరాలు పోస్టర్ ను ఆవిష్కరించిన అడిషనల్ కలెక్టర్ శ్రీజ"

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 4 (భద్రాద్రిన్యూస్):-

జన విజ్ఞాన వేదిక తెలంగాణ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుండి నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాలు పోస్టర్ ను అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) శ్రీజ బుధవారం కలెక్టరేట్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. ఈ చెకుముకి టాలెంట్ పరీక్షల ద్వారా విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షులు ఎస్వి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి అలవాల నాగేందర్ , రాష్ట్ర కమిటీ సభ్యులు శివ నారాయణ ,జిల్లా కమిటీ సభ్యులు తాతా రాఘవయ్య , బంధం బాబురావు తదితరులు పాల్గొన్నారు.



ముదిరాజ్‌లను బీసీఏలో చేర్చే ప్రతిపాదనను విరమించుకోవాలి

- **అత్యంత వెనుకబడిన కులాలకు అన్యాయం జరుగుతుంది.. ప్రభుత్వానికి బురహాన్‌పురం గంగపుత్ర సంఘం విజ్ఞప్తి**
- **కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం.. ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చుతామన్న హామీలపై తీవ్ర అభ్యంతరం**

ఖమ్మం, నవంబర్ 4 (భద్రాద్రిన్యూస్):

ముదిరాజ్ కులాన్ని బీసీఏ (BCA) జాబితాలో చేర్చకూడదని బురహాన్‌పురం గంగపుత్ర సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. సంఘం నూతన కమిటీ తొలి కార్యవర్గ సమావేశం బుధవారం అధ్యక్షుడు జీజుల శంకరయ్య అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా ముదిరాజ్ కులాన్ని బీసీఏలో చేర్చుతామని రాష్ట్ర ప్రభుత్వంలోని పలువురు నాయకులు ఇస్తున్న హామీలు, వాగ్దానాలను కార్యవర్గం తీవ్రంగా ఖండించింది. ఇప్పటికే బీసీఏ జాబితాలో ఉన్న అత్యంత వెనుకబడిన కులాల హక్కులకు భంగం కలిగే ప్రమాదం ఉందని సభ్యులు అభిప్రాయపడ్డారు. అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ కులాన్ని బీసీఏలో చేర్చినట్లయితే ప్రస్తుతం ఆ జాబితాలో ఉన్న అత్యంత వెనుకబడిన కులాలు విద్య, ఉద్యోగ, ఇతర అవకాశాల్లో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇటువంటి ప్రయత్నాలను విరమించుకోవాలని కోరుతూ కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది.

ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడు జీజుల శంకరయ్య, కార్యదర్శి పెద్దపల్లి సుధాకర్, కోశాధికారి డోలి శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు పెద్దపల్లి సోమయ్య, గౌరవ సలహాదారు పాకాల ఉపేందర్, ఉపాధ్యక్షుడు పిల్లి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



యధావిధిగా విద్యుత్తు పునరుద్ధరణ

భద్రాద్రి న్యూస్ , బోనకల్ :



మురసు తుఫాను కారణంగా నిన్నటి నుండి కురుస్తున్న భారీ వర్షాలకు మధిర 132 కెవి నుండి బోనకల్, మోటమర్రి, సిరిపురం సబ్ స్టేషన్ కి వెళ్ళు విద్యుత్తు సరఫరా చేసే ప్రధాన విద్యుత్ స్తంభం విరిగిపడటంతో, విద్యుత్ అంతరాయం లేకుండా ఉండుటకు ప్రత్యామ్నాయంగా పెద్దగోపతి నుండి విద్యుత్ సరఫరా చేయనైనది. ఈరోజు ఈ మూడు సబ్ స్టేషన్లకు సరఫరా చేసే విద్యుత్ స్తంభాన్ని మరియు లైన్లను విద్యుత్ శాఖ అధికారుల స్వీయ పర్యవేక్షణలో సిబ్బంది పునరుద్ధరించి యధావిధిగా మధిర 132 కెవి నుండి విద్యుత్ సరఫరా కొనసాగించారు. ఈ మరమ్మతులు కొనసాగిన కార్యక్రమంలో మధిర డివిజన్ డి ఈ బండి శ్రీనివాసరావు, మధిర ఏడిఈ అనురాధ, బోనకల్ ఏడీఈ ఆనంద్, మధిర రూరల్ సెక్షన్ ఏఈ మైథిలి, కలకోట ఏఈ మోహన్ మరియు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షా న్నీ లెక్కచేయని ఆర్యవైశ్యుల ఐక్యతా సందడి!

- **ఇల్లందులో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్‌కు ఘన స్వాగతం**
- **సేవా కార్యక్రమాలపై ప్రశంసల జల్లు.. ప్రభుత్వ పాఠశాలలో జ్ఞాన సరస్వతి విగ్రహావిష్కరణ**

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 4 (భద్రాద్రిన్యూస్):

వర్షం కురుస్తున్నా.. సేవా సంకల్పం ముందు వానసైతం చిన్నబోయింది. ఆర్యవైశ్యుల ఐక్యతకు ఇల్లందు వేదికగా నిలిచింది. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ శిద్ధా వెంకట సూర్య ప్రకాశరావు గుడ్‌విల్ విజిట్ సందర్భంగా ఇల్లందు వాసవి క్లబ్, వనిత క్రౌన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలకు ఆర్యవైశ్యుల నుంచి విశేష స్పందన లభించింది. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేశారు.

ముందుగా హరిహర క్షేత్రానికి చేరుకున్న ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్‌కు ఆలయ చైర్మన్ ఆర్. మంజుల, ఈఓ సి.హెచ్. రామకోటేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పట్టు చీర, ఆభరణాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు వేద ఆశీర్వచనాలు అందించారు.

ఈ సందర్భంగా నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు, రైతుకు ఛార్జింగ్ స్ప్రే పంపు, ఆలయ సహాయక సిబ్బందికి చీరలు పంపిణీ చేసి సేవా నిరతిని చాటుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో జ్ఞాన సరస్వతి విగ్రహావిష్కరణ

అనంతరం ఇల్లందు మెయిన్‌రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చేరుకున్న అతిథులకు వాసవి క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్ కలర్ పార్టీ, బ్యాండ్ పార్టీతో ఘన స్వాగతం పలికారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జ్ఞాన సరస్వతి అమ్మవారి విగ్రహాన్ని ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆవిష్కరించారు. ఈ విగ్రహ ఏర్పాటుకు వాసవి క్లబ్ అధ్యక్షుడు కటకం సత్యేంద్ర కుమార్, వనిత క్రౌన్ అధ్యక్షురాలు కటకం అలేఖ్య దాతలుగా వ్యవహరించారు.

ఇల్లందు బొగ్గు గనులకు పుట్టినిల్లుగా ప్రసిద్ధి చెందిందని గుర్తుచేస్తూ, బొగ్గు గని కార్మికుల భద్రతకు ప్రతీకగా సేఫ్టీ బైట్, టోపీ, చమ్మాస్‌ను జోన్ చైర్మన్ బోనగిరి రవికిరణ్ అందజేశారు. విద్యార్థుల అత్యవసర వైద్య అవసరాల నిమిత్తం మెడికల్ ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి అందించారు.

అత్యవసర పని నిమిత్తం ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ తదుపరి కార్యక్రమాల బాధ్యతలను రీజినల్ చైర్మన్ దూపకుంట్ల అనిల్ కుమార్‌కు అప్పగించి వెళ్లారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు.. ప్రతిభకు పట్టాభిషేకం

రీజినల్ చైర్మన్ దూపకుంట్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వస్త్రాలు, పదో తరగతి విద్యార్థులకు పరీక్షా కిట్లు, ఎస్ఏ1 పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు పంపిణీ చేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు, మొదటి రెండు స్థానాల్లో నిలిచిన వారికి మెమెంటోలు అందజేశారు. పాఠశాల సహాయక సిబ్బందికి చీరలు, విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఇల్లందు వాసవి క్లబ్, వనిత క్రౌన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రత్యేకంగా అభినందించారు. “మీ సేవా కార్యక్రమాలు అద్భుతం” అంటూ నిర్వాహకులను ప్రశంసించారు.

ప్రముఖుల సందడి.. ఐక్యతకు ప్రతీకగా కార్యక్రమం

ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ సెక్రటరీ దరిసి శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ V106A గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీలు చింతల వినోద్, రేపాక రాజ మనోహర్, ఉడతా నగేష్ కుమార్, రీజినల్ చైర్మన్ దూపకుంట్ల అనిల్ కుమార్, రీజినల్ సెక్రటరీ అలేఖ్య, ఐపీసీ శీమకుర్తి రాజ మనోహర్ పాల్గొన్నారు. అలాగే ఇల్లందు వాసవి క్లబ్ ఐఈసీ ఆఫీసర్ చిదిరాల లింగయ్య, ఐపీసీలు వ్యామసాని జనార్దన్, అర్వపల్లి రాధాకృష్ణ, డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రటరీలు పుల్లూరు సతీష్ కుమార్, జొన్నల ఉపేందర్ నాథ్ గుప్తా, డీపీఓలు యెలుగురి మధుబాబు, సైఫా రాజశేఖర్,



జోన్ చైర్మన్ బోనగిరి రవికిరణ్, వాసవి క్లబ్ అధ్యక్షుడు కటకం సత్యేంద్ర కుమార్, వనిత క్రౌన్ అధ్యక్షురాలు కటకం అలేఖ్య, ప్రధాన కార్యదర్శి తీర్దాల నాగరాజు, కోశాధికారి బోనగిరి రమేష్, వనిత క్రౌన్ కోశాధికారి సముద్రాల ఉషారాణి, ఆర్యవైశ్య మహాసభ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి యెలుగురి నగేష్ కుమార్, ఇల్లందు మండల అధ్యక్షుడు పాబోలు మణికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తాటిపల్లి సుబ్బారావు, గౌరీశెట్టి కృష్ణ, దొడ్డా రాజు, కటకం సత్యనారాయణ, తీర్దాల వెంకటేశ్వర్లు, కటకం సుమన్, జంగాల హరీష్, అర్వపల్లి రాజేష్, కటకం రేణుకాదేవి, బోనగిరి కల్పన, చిక్కా త్రివేణి, కటకం ప్రణవి, కటకం కళావతి, మాశెట్టి నరసింహారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లాలు, ఉపాధ్యాయులు, హరిహర క్షేత్రం ధర్మకర్తల మండలి సభ్యులు లింగంపల్లి శ్రీనివాస్, చేరుకుమాళ్ల శంకర్, నాళ్ల సురేష్ కుమార్, బొల్లి శబరీష్ కుమార్, బత్తుల చెంచమ్మ, బండారు రాఘవాచారి, వల్లాల మణికంఠ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ఆర్యవైశ్య సోదర సోదరీమణుల ఐక్యత, వాసవి క్లబ్, వనిత క్రౌన్ నిర్వహించిన సేవా కార్యక్రమాలు పట్టణ ప్రజల ప్రశంసలు అందుకున్నాయి.

బి ఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాకేష్ రెడ్డి కి ఘన స్వాగతం

భద్రాద్రి న్యూస్ ములుగు

ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు గారి ఆదేశాల మేరకు భూక్య జంపన్న ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాకేష్ రెడ్డి గారికి ఘన స్వాగతం.పలికారు బుధవారం ములుగు జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గట్టమ్మ గుడి వద్ద బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాకేష్ రెడ్డి ని పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిశారు. ఈ సందర్భంగా గట్టమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు ఈ కార్యక్రమంలో భూక్య జంపన్న ఆధ్వర్యంలో బీఆర్ఎ





స్ పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ పెద్దలు, యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

అధ్వానంగా కలివేరు ప్రధాన రహదారి

- **నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలి**
- **అధికారులు తక్షణమే స్పందించాలి – ఇరప. రాజుదొర**



భద్రాద్రి న్యూస్ చర్ల



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం నియోజకవర్గం, చర్ల మండలం కలివేరు గ్రామ ప్రధాన రహదారి అధ్వానంగా మారి గుంతలమయంగా తయారైందని ఆదివాసి పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరుప రాజు ఆవేదన వ్యక్తం చేశారు.వర్షం పడితే రహదారిపై నీరు నిలిచి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని

గ్రామీణ ప్రజల రాకపోకలకు కీలకమైన ఈ ప్రధాన రహదారిని ప్రభుత్వం, ఆర్ అండ్ బిశాఖ అధికారులు తక్షణమే పరిశీలించి నూతన రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.అవసర మైన నిధులు మంజూరు చేసి నాణ్యతా ప్రమాణాలతో రహదారి నిర్మాణం చేపట్టాలని ప్రజల ప్రాణాలు, ప్రయాణ భద్రతను దృష్టిలో పెట్టుకొని అధికారులు నిర్లక్ష్యం వీడి వెంటనే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు

మురుసు తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి

- **పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించాలి: మాజీ ఎంపీ నామ**
- **నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి: మాజీ ఎంపీ నామ**
- **రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలి: మాజీ ఎంపీ నామ**

ఖమ్మం ప్రతినిధి ,నవంబర్ 4 (భద్రాద్రిన్యూస్):-



మురుసు తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో వరి, పత్తి, ఇతర సాగు పంటలు తీవ్రంగా దెబ్బతినడం పట్ల బీఆర్ఎస్, మాజీ లోక్ సభ పక్ష నేత ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన పంటలు వర్షాల కారణంగా నీటమునిగి, నేలకొరిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ అధికారులతో పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించి, నష్టాన్ని అంచనా వేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పంటలు దెబ్బతిన్న ప్రతి రైతును గుర్తించి, నష్టపరిహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పెట్టుబడుల భారం, సాగు ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ప్రకృతి వైపరీత్యం మరింత నష్టాన్ని మిగిల్చిందని పేర్కొన్నారు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టి, వారికి అండగా నిలవాలని నామ కోరారు.

పేదల ఆరోగ్యమే లక్ష్యంగా పల్లా కిరణ్ సేవా యజ్ఞం!

- **పల్లా జాన్ రాములు 88వ జయంతి సందర్భంగా భారీ ఉచిత వైద్య శిబిరం**
- **వర్షా న్ని సైతం లెక్కచేయకుండా తరలివచ్చిన వెయ్యి మందికి పైగా నిరుపేదలు.. 300 మందికి ఉచిత కళ్లజోళ్ల పంపిణీ**

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 4 (భద్రాద్రిన్యూస్):

పేదల పక్షపాతిగా, పీడిత ప్రజల గొంతుకగా నిలిచి, జీవితాంతం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు స్వర్గీయ పల్లా జాన్ రాములు 88వ జయంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు, ప్రముఖ సామాజిక సేవకుడు పల్లా కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత జనరల్ వైద్య, కంటి వైద్య శిబిరాలు విజయవంతమయ్యాయి.

స్థానిక ఖమ్మం మిషన్ హాస్పిటల్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని డోర్నకల్ బిషప్ ఆర్‌టీ రెవరెండ్ డాక్టర్ కె. సేనం రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో నిరుపేదలు శిబిరానికి తరలివచ్చారు. ఈ శిబిరంలో వెయ్యి మందికి పైగా వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందారు. అదేవిధంగా 300 మందికి పైగా నిరుపేదలకు ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా బిషప్ కె. సేనం రాజు మాట్లాడుతూ స్వర్గీయ పల్లా జాన్ రాములు పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగుతున్న పల్లా కిరణ్‌ను అభినందించారు.

ఈ కార్యక్రమంలో రెవరెండ్ డాక్టర్ విశ్వం, జి. ప్రభాకర్ రావు, రెవరెండ్ బి. శ్రీనివాస్ పాల్, రెవరెండ్ ఇశ్రాయేల్ రెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఎల్లయ్య, చిలకబత్తిని కనకయ్య తదితరులు పాల్గొని పల్లా కిరణ్‌ను ఆశీర్వదించారు. వైద్యులైన డాక్టర్ రఘు, డాక్టర్ సృజన్, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ హరికృష్ణ, గంట కిరణ్‌తో పాటు పల్లా కిరణ్ యూత్ సభ్యులు శిబిరం విజయవంతానికి కృషి చేశారు.

ఈ సందర్భంగా పల్లా కిరణ్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం రెండుసార్లు ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కరోనా సమయంలో 3,000 మందికి మామిడికాయ పచ్చడి పంపిణీ చేయడంతో పాటు ప్రైవేటు ఉపాధ్యాయులు, పేద కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు అందించినట్లు వివరించారు.

వరదల సమయంలో బాధితులకు ఆహారం, తాగునీరు, నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశామని తెలిపారు. నిరుపేద విద్యార్థుల ప్రాథమిక, ఉన్నత విద్యకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో సొంత ఖర్చులతో బోర్లు ఏర్పాటు చేసి, ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.

వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, అనాథ బాలబాలికలు, యువతకు వివిధ రూపాల్లో అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగించడం సంతృప్తినిస్తోందని పల్లా కిరణ్ పేర్కొన్నారు. తన తండ్రి పల్లా జాన్ రాములు చూపిన సేవా మార్గంలో నడుస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.









అవినీతి తిమింగలం సస్పెన్షన్: ముదిరాజ్ సమాజంలో వెల్లువలాంటి హర్షం!

- **-నకిలీ జీవోలు, బోగస్ సభ్యత్వాల దందాకు అడ్డుకట్ట వేసిన ప్రభుత్వం..**
- **-పేద మత్స్యకారుల పొట్టకొట్టిన అవినీతి అధికారిపై ముదిరాజ్ సంఘం తీవ్ర ఆగ్రహం..**
- **-త్వరితగతిన చర్యలు తీసుకున్న ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు..**

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 4 (భద్రాద్రిన్యూస్):-

మత్స్యశాఖలో సుదీర్ఘకాలంగా తిష్టవేసి, అధికార బలంతో పేద మత్స్యకారుల రక్తాన్ని పిండిన అవినీతి అధికారి ఆంజనేయ స్వామి పై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేయడం పట్ల రాష్ట్ర, జిల్లా ముదిరాజ్ సంఘం తీవ్ర హర్షం వ్యక్తం చేసింది.. అవినీతి అధికారి సస్పెండ్ అయిన వార్త తెలియగానే రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ కులస్థులు పటాకులు కాల్చి, మిఠాయిలు పంచుకుని తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు.. తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చోప్పరి శంకర్ ముదిరాజ్ ఆదేశాల మేరకు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అత్యవసర విలేకరుల సమావేశంలో ముదిరాజ్ కుల పెద్దలు, సంఘం ప్రతినిధులు ఒకే తాటిపై కూర్చొని అవినీతి అధికారి అక్రమాల సామ్రాజ్యాన్ని ఎండగట్టారు..

లంచాల పిశాచి.. నకిలీల సూత్రధారి..

ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ... సస్పెండ్ అయిన అధికారి ఒక లంచాల పిశాచిలా ప్రవర్తించాడని మండిపడ్డారు.. కేవలం కోమట్లగూడెం సొసైటీకే పరిమితం కాకుండా, జిల్లా వ్యాప్తంగా వందలాది నకిలీ సభ్యత్వాలను సృష్టించి సాంప్రదాయక వృత్తి నైపుణ్యం లేని అనర్హులకు చెరువులను కట్టబెట్టాడని ధ్వజమెత్తారు.. ఏకంగా ప్రభుత్వ ఉన్నత ఉత్తర్వులను (జీఓస్) సైతం ఫోర్జరీ చేసి, బోగస్ ప్రొసీడింగ్స్ తయారు చేసిన ఇలాంటి ఘోరమైన అవినీతి అధికారి వల్ల ఎంతోమంది నిజమైన ముదిరాజ్ బిడ్డలు ఆకలితో అలమటించారని, సొసైటీల మధ్య గొడవలు పెట్టి పబ్బం గడుపుకున్నాడని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్నాళ్లకు పాపం పండి ఈ అవినీతి తిమింగలం ఇంటికి చేరిందని వారు ఎద్దేవా చేశారు.

ప్రభుత్వానికి జేజేలు.. శ్రమజీవుల పక్షపాతి ఈ ప్రభుత్వం..

పేద మత్స్యకారుల ఆవేదనను, తాము అందించిన ఫిర్యాదులను పరిశీలించి తక్షణమే స్పందించిన ప్రభుత్వంపై ముదిరాజ్ కులస్థులు ప్రశంసల వర్షం కురిపించారు.. అక్రమార్కుడిని ఉపేక్షించకుండా, సస్పెన్షన్ వేటు వేసి ప్రభుత్వం తన నిజాయితీని, ప్రజాపక్షపాత వైఖరిని చాటుకుందని కొనియాడారు.. "శ్రమ నమ్ముకున్న ముదిరాజ్ బిడ్డలకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ నిర్ణయంతో రుజువైంది" అని హర్షం వ్యక్తం చేశారు. ఇంతటి సాహసోపేతమైన, న్యాయమైన నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి కి, మత్స్యశాఖ మంత్రి ఖమ్మం ఇన్చార్జి వాకటి శ్రీహరి కి, ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, విచారణను వేగవంతం చేసిన ఆ శాఖ ఉన్నతాధికారులకు, (కమిషనర్ కి) ముదిరాజ్ సమాజం తరపున శిరస్సు వంచి హృదయపూర్వక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు..

బోగస్ సభ్యత్వాలు పూర్తిగా రద్దు చేయాలి..



సస్పెన్షన్ నిర్ణయాన్ని స్వాగతిస్తూనే, అవినీతి అధికారి జిల్లా అంతటా సృష్టించిన అన్ని నకిలీ జీవోలను, బోగస్ సభ్యత్వాలను తక్షణమే రద్దు చేసి స్క్రీనింగ్ కమిటీ ద్వారా నిజమైన మత్స్యకారులకే చెరువులపై పూర్తి హక్కులు కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు.. ప్రభుత్వ పత్రాలను ఫోర్జరీ చేసినందుకు అతనిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, అక్రమ ఆస్తులను జప్తు చేయాలని కోరారు. పేదల పొట్టకొట్టే అధికారులకు ఈ సస్పెన్షన్ ఒక బలమైన హెచ్చరిక కావాలని ముదిరాజ్ సంఘం స్పష్టం చేసింది. ఈ విలేకరుల సమావేశంలో మన ముదిరాజు మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోప్పెర వెంకట నరసయ్య ముదిరాజ్, ఉపాధ్యక్షులు ప్రతాపు వెంకటేశ్వర్లు ముదిరాజ్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు కొప్పెర జానకి రాములు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి కొమ్ము భాస్కర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు, మత్స్యశాఖ కన్వీనర్ బొమ్మకంటి సైదులు ముదిరాజ్, ఉపాధ్యక్షులు చింత నబోయిన సీతారాములు ముదిరాజ్, దంతాల కేశవులు ముదిరాజ్, గొడుగు నాగేశ్వరరావు ముదిరాజ్, బండారి శ్రీను ముదిరాజ్, కోశాధికారి ఓర వెంకటేశ్వర్లు ముదిరాజ్, కార్యదర్శులు పందుల ఉపేందర్ ముదిరాజ్, చామకూరి నాగేశ్వరరావు ముదిరాజ్, గోగుల శ్రీను ముదిరాజ్, నర్ల శేషయ్య ముదిరాజ్, కోమట్లగూడెం మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు పిట్టల వెంకటేశ్వర్లు ముదిరాజ్, జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు బుడిగె వెంకటేశ్వర్లు ముదిరాజ్, అడపా ప్రవీణ్ ముదిరాజ్, వివిధ మండలాల ప్రతినిధులు, బాధిత మత్స్యకార సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.